# క్...గక్ చిక్

-అనూరాధ

"అదేంటే అమ్మాయ్? అమృత అలా అయిపోయింది? ఏం? పిల్లకీ మధ్య ఒంట్లో బాగుండడం లేదా?" వచ్చీరాగానే శాంతమ్మ అమృతని ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"నాకేం? నేను బాగానే ఉన్నాను నాన్నమ్మా!" అమృత భుజాలెగరేసి నవ్వేసింది.

"అవునత్తయ్యా! దానికేం చక్కగా ఉంది" సుజాతా కూతుర్ని వెనకేసుకొచ్చింది. కానీ శాంతమ్మ మూడేళ్ళ తర్వాత చూస్తున్న తన మనవరాలు అంత సన్నగా, పూచికపుల్లలా అయిపోయిందని అనుమానంగా చూస్తూనే ఉంది.

"హాయ్ నాన్నమ్మా!" వరుణ్ ఆ రాత్రి డిన్నర్‌టైంకి ఇంటికొచ్చి పలకరించాడు.

మనవణ్ణి మురిపెంగా చూసుకుంటూ "ఏరా నాన్నా! ఆఫీసులో ఇంతసేపూ పనే?" అడిగింది శాంతమ్మ.

"అవునమ్మా! ఇండియాలో ఉంటే ఇదుగో ఈ టైంకి ఇంటికొస్తాడు. మరి విదేశాల్లో ఉంటే ఏం చేస్తాడో మాకూ తెలియదు. ఆ ప్రాజెక్టుల్లో వాళ్లకి నిద్రాహారాలుండవు అంతపని" శ్రీనివాస్ కాస్త బాధగా చెప్పాడు.

"బావుంది మరి మీ ఉద్యోగాల్లాంటివా వాళ్లవి? ఇన్నేళ్ల సర్వీసున్న మీ నెలజీతం కన్నా వాడి మొదటి నెల జీతమే ఎక్కువ. అలా అనుకుంటే ఎలా?" అంది సుజాత గర్వంగా కొడుకుని చూసుకుంటూ.

శ్రీనివాస్ ఢిల్లీలో రిజర్వ్‌బ్యాంక్‌లో ఆఫీసర్‌గా చేస్తూ అక్కడే సెటిలైపోయాడు. పిల్లలూ అక్కడే పుట్టి పెరిగారు. తన భర్త మంచి పొజిషన్లో ఉన్నాడని సుజాతకి మొదటినుంచీ కాస్త గర్వమే. అలాంటిది వరుణ్ కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరై బాగా సంపాదిస్తుండడంతో అది ఇంకాస్త పెరిగింది. ఇక అమృత పోస్టుగ్రాడ్యుయేషన్ చేస్తున్నా సుజాత ఇంకా చంటిపిల్లలాగే చూస్తుంది. ఆ రోజే ఆంధ్రాలోని పల్లెటూరు నుంచి వచ్చిన శాంతమ్మ సుజాత వడ్డిస్తున్న భోజనంకేసి అయోమయంగా చూస్తోంది. రెండు పుల్కాలు, ఉడికీ ఉడకని బీరకాయముక్కలు, పచ్చి కీరదోసముక్కలు.

"అత్తయ్యా! మీ కోసం అన్నం కూడా వండానండి" అదేదో పెద్ద విశేషంలా చెప్పి ఆవిడ ప్లేట్లో అన్నం వడ్డించింది సుజాత. కాస్త భయంగానే ఆ అన్నంలో ఆ ఉప్పూకారం లేని బీరకాయముక్కలు కలుపుకున్న శాంతమ్మకి వాంతొచ్చినంత పనయ్యింది.

పక్కనే ఉన్న అమృత ఒకే ఒక పుల్కా తిని లేచిపోవడంతో ఆవిడ ఇంక ఆగలేకపోయింది.

"ఏమయిందర్రా మీకు? ఎందుకిలా పత్యం తిండి తింటున్నారు? అమృత ఇలా కళ్ళలోపలికి పోయి ఎముకల గూడై పోయింది. సుజాత అలా చిక్కిపోయింది. శ్రీనూ నువ్వూ బాగా ఎండిపోయావు. మీకందరికీ ఒంట్లో బాగానే ఉంటోందా?" భయపడుతూ అడిగింది.

"ఓ గాడ్! నాన్నమ్మా యూ ఆర్ టూమచ్. ఇది డైటింగ్ అంతే?" అమృత సింపుల్‌గా చెప్పేసింది.

"డైటింగా? అంటే?" ఆవిడకసలు అర్థంకాలేదు.

"ఏంలేదు నాన్నమ్మా. ఇది ఒక ఫ్యాషన్. స్లిమ్‌గా ఉండడానికే ఇన్ని తిప్పలు. అమ్మా, అమృతా డైటింగ్ కాదుగానీ మాక్కూడా రోజూ ఇదే ఫుడ్. నేనయితే ఫర్వాలేదు. చాలావరకూ బయటే తింటాను పాపం డాడీయే దొరికిపోతున్నారు" వరుణ్ నవ్వుతూ చెప్పాడు.

"అయ్యయ్యో సన్నగా ఉండాలంటే ఇదా మార్గం? సుజాతా ఇది మంచి పద్ధతి కాదమ్మా. అమృత అసలే వయసులో ఉన్న పిల్ల అచ్చంగా పేషంట్లా తయారయింది. ఇప్పుడే ఇలా ఉంటే తర్వాత ఎలా ఉంటుంది? చక్కగా తిని దానికి తగ్గ పని చేస్తే ఒళ్ళేం రాదు? అసలీ వయస్సులో ఎలా ఉండాలి? మనసింధు చూడు.." అంటోంది శాంతమ్మ.

"అవును నాన్నమ్మా అత్తయ్యా, సింధు ఎలా ఉన్నారు? వాళ్లనీ తీసుకురావాల్సింది" అప్పటికే సుజాత మొహం సీరియస్ అయిపోవడంతో వరుణ్ టాపిక్ డైవర్ట్ చేశాడు.

"మీ అత్తయ్య ఆరోగ్యం ఏం బాలేదురా. మళ్ళీ ఆ గుండెజబ్బు తిరగబెట్టింది. అందుకే వాళ్ళు రాలేదు" అంది శాంతమ్మ.

"సింధు ఏం చదువుతోంది నాన్నమ్మా?" అమృత ఇంట్రెస్టింగ్‌గా అడిగింది.

"డిగ్రీ సెకండియర్ అమ్మా. ఏదీ మన ఊళ్ళో కాలేజీ లేదు. రోజూ టౌన్‌కెళ్లి రావాలి. అలాగే వెళ్ళొస్తుంది" అందావిడ.

"అప్పుడే సింధు డిగ్రీకొచ్చేసిందా?" వరుణ్ కాస్త ఆశ్చర్యపోయాడు.

"ఆడపిల్లలెంతలో ఎదిగిపోతారు" ఆవిడ ఎందుకో నిట్టూర్చింది.

★ ★ ★

ఆ రాత్రి భోజనాలయ్యాక శ్రీనివాస్‌నీ, సుజాతనీ పట్టుకుని మెల్లగా కదిపింది శాంతమ్మ.

"శ్రీనూ వసంతకీ మధ్య ఒంట్లో ఏం బాగుండడం లేదు. నేనూ కాటికి కాళ్ళు జాపుకున్నాను. అందుకే వసూ సింధు పెళ్ళి గురించి బాగా తొందరపడుతోంది" అంది.

"అయితే ఏదన్నా మంచి సంబంధం చూసి పెళ్లి చేసేయండి" అంది సుజాత.

"చేసేయచ్చు. కానీ మా తర్వాత అది ఒంటరిదై ఎవరితోనో ఉండేబదులు మీతోనే ఉంటే మాకూ నిశ్చింతకదా. ఎలాగూ వరుణ్‌కీ, సింధూకీ వరసే కదా. అందుకే మిమ్మల్ని ఓసారి అడుగుదామని వచ్చాను" అంది శాంతమ్మ.

"అత్తయ్యా! వరుణ్‌కింకా పట్టుమని పాతికేళ్ళు కూడా లేవు. ఇప్పుడే వాడికి పెళ్లేంటి? అయినా కూడా వాడు ఇవాళ ఇండియాలో ఉంటే రేపు అమెరికాలో ఉంటాడు. వాణ్ణి చేసుకునే అమ్మాయి వాడికి తగ్గట్టుండాలి కదా. ఆ పల్లెటూళ్ళో పెరిగిన సింధూనిచ్చి చేస్తామంటే వాడు ముందు ముందు మమ్మల్నంటాడు. అందుకే మీరు సింధుకేదైనా మంచి మ్యాచ్ చూడండి. మా సాయం ఏమన్నా చెయ్యాలంటే మేమూ చేస్తాం" నిష్కర్షగా చెప్పేసింది సుజాత. పెళ్లయిన రెండేళ్లకే భర్త పోయి పుట్టింటికి చేరిన వసంత అంటే సుజాతకి బాగా చులకన. శాంతమ్మ ఏదోరోజు ఈ ప్రస్తావన తెస్తుం

దని ఊహించి ఏం చెప్పి ఆ ప్రపోజల్ తిరగ్గొట్టాలో ముందే ప్రిపేరయింది సుజాత. సింధుని చేసుకోవడం సుజాతకిష్టం లేదని ముందునుంచీ తెలిసిన శ్రీనివాస్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

* * *

రెండునెలల తర్వాత సింధు పెళ్ళి కుదిరిందని శాంతమ్మ ఫోన్ చేసింది.

"శ్రీనూ! ఇంకో ఇరవైరోజుల్లో పెళ్ళి. మీరందరూ కనీసం నాలుగురోజుల ముందొచ్చి పెళ్లి జరిపించాలి'' అని చెప్పింది.

చివరికి అందరికీ సెలవులు దొరికి అతి కష్టం మీద రెండ్రోజుల ముందు పెళ్లికెళ్లారు. విజయవాడలో ఫ్లైట్ దిగి అక్కణ్ణుంచి టాక్సీలో గోదావరిజిల్లాలోని తమ పల్లెటూరు వెళుతున్నారు. దారంతా పంటకాలవలు, పచ్చనిపొలాలు, కొబ్బరిచెట్లు చూస్తూ వరుణ్ అమృత బాగా ఎంజాయ్ చేస్తున్నారు. చివరికి ఊరు రానే వచ్చింది.

"డాడ్! నేను ఇక్కడికొచ్చి పదేళ్లపైనే అయిపోయింది కానీ ఊరేం మారలేదే అలాగే ఉంది'' అన్నాడు వరుణ్.

"మారడానికి అక్కడేముంది గనుక''సుజాత విసుగ్గా అంది. ఆమెకసలా ఊరురావాలంటేనే పరమచిరాకు. శ్రీనివాస్ నవ్వి ఊరుకున్నాడు.

ఇంటిముందు టాక్సీ ఆగేసరికి అప్పటికే పెళ్లిపనుల్లో బిజీగా ఉన్న చుట్టుపక్కల అమ్మలక్కలందరూ కుతూహలంగా చూస్తున్నారు.

"అత్తయ్యా, మామయ్యా వచ్చేశారా?'' పెళ్లికూతుర్నని మరిచిపోయి పరిగెత్తుకొచ్చింది సింధు.

శ్రీనివాస్ చాలాసార్లు వస్తూనే ఉంటాడు కాబట్టి పెద్దగా ఆశ్చర్యపోలేదు కానీ సుజాతా, వరుణ్, అమృతలు మాత్రం పదేళ్ల తర్వాత సింధుని ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు. సన్నగా, పొడుగ్గా పచ్చగా మిసమిసలాడుతున్న ఆ అందాలరాశిని చూసి కళ్ళు తిప్పుకోలేకపోయారు.

'ఏం క్రీమ్‌లు రాసుంటుంది? ఆ ఫిగర్ ఎలా మెయింటైన్ చేస్తుంటుంది?' అమృత ఆలోచిస్తోంది.

"హాయ్ సింధూ! యూ ఆర్ లుకింగ్ గార్జియస్'' వరుణ్ ఎప్పుడూ ఫ్రాంక్‌గా మాట్లాడేస్తాడు.

చిలకాకు పచ్చ పట్టుపరికిణీ, ఎర్రని ఓణీలో సింధు అచ్చంగా సిందూరంలా మెరుస్తుండడంతో సుజాత మొహం మాడిపోయింది.

"ఏంటన్నయ్యా ఇది? ఎల్లుండి పెళ్ళి పెట్టుకుని ఇవాళా రావడం?'' వసంత కాస్త నిష్ఠూరంగా పలకరించింది.



"అమ్మా! వచ్చీరాగానే ముందు వాళ్లని ఊపిరైనా తీసుకోనివ్వవా?" సింధూ ఆమెని వారించి అందరికీ కాఫీలు తెచ్చిచ్చింది.

"థ్యాంక్యూ!" అంటూ శ్రీనివాస్, వరుణ్ తీసుకున్నారు.

"మేం కాఫీలు తాగం?" సుజాత ముందు చెప్పేసింది.

"పోనీ పాలు తెస్తాను" అంది సింధు.

"నోనో! అందులో చాలా ఫాట్ ఉంటుంది" అమృత కంగారుగా అంది.

"మరింకేం తాగుతారు?" సింధూ ఆశ్చర్యంగా అడిగింది.

"డోంట్‌వర్రీ సింధూ. వాళ్ళు చాలా సరంజామా తెచ్చుకున్నార్లే. నువ్వు వాళ్లకేం పెట్టకపోయినా ఫర్వాలేదు!" వరుణ్ నవ్వుతూ చెప్పేశాడు.

"ఇక్కడ ఉన్న ఈ నాలుగురోజులైనా మీ డైటింగ్‌లు కాస్త మూనె శుభ్రంగా తినండర్రా. పెళ్లంటే బోల్డు పనుంటుంది" శాంతమ్మ క్లాసు మొదలెట్టింది.

సుజాత చిరాగ్గా చూసింది.

పట్టుచీర కట్టుకుని పెత్తనం చెయ్యమంటే ఫర్లేదు కానీ పనంటే? ప్రాణసంకటమే.

★ ★ ★

"ఎప్పుడు తిన్నారో ఏమో రండి. ముందు భోజనాలు చెయ్యండి" శాంతమ్మ వాళ్లందర్నీ చూసి ఒకటే హడావిడి పడిపోతోంది.

హాల్లో అరిటాకులు పరిచి అందర్నీ పిలిచింది సింధు. శాంతమ్మ వంటింట్లోంచే పనులు పురమాయిస్తోంది.

అంతా అతికష్టం మీద నేలమీద కూర్చున్నారు.

ఒక్క ఐటమ్ పట్టుకొచ్చి వడ్డిస్తున్నారు సింధు, శాంతమ్మ.

"సింధూ! ఇదేం బాగాలేదు. నువ్వు పెళ్లికూతురివి. నువ్వు వడ్డించడమేమిటి? నువ్వూ కూర్చో" అంది అమృత.

"ఫర్వాలేదు అమృతా అమ్మమ్మ ఒక్కత్తే చెయ్యలేదు" అంది సింధు.

"అదంతే అమృతా. ఏదో వంక పెట్టి అలా ఒక్కక్షణం కూర్చోకుండా తిరుగుతూనే ఉంటుంది. రేపు పెళ్లికూతుర్ని చేశాకైనా కదలకుండా కూర్చోమ్మా సింధు" వసంత నీరసంగా చెప్పింది.

శ్రీనివాస్, వరుణ్‌లు బాగా ఆకలి మీద ఉన్నారేమో ఆవురావురుమని భోంచేస్తున్నారు.

చింత చిగురు పప్పు, గుత్తొంకాయకూర, గోంగూర పచ్చడి, గుమ్మడికాయ పులుసు అన్నీ అద్భుతంగా ఉన్నాయి.

"అంతా ఆయిల్" సుజాత పెదవి విరుస్తూ అన్నీ కాస్త కాస్త తిని వదిలేస్తోంది. అమృత ఆ రుచికి తినలేక మానలేక సంశయిస్తూ మెల్లగా తింటోంది.

"వరుణ్! నీకిష్టమని నేనే మర్చిపోయాను"

"థ్యాంక్యూ నాన్నమ్మా! నాకోసం అంత గుర్తుపెట్టుకుని చేయించావా?" అడిగాడు వరుణ్.

ఆవిడోసారి నవ్వి "సింధూ! బాగా నెయ్యి వెయ్యమ్మా! వరుణ్‌కి చిన్నప్పుడైతే నేనే కలిపి పెట్టేదాన్ని, వాడికి కలుపుకోవడం సరిగ్గా రాదు" అంటూ సింధూ చేత నాలుగుగరిటెల నెయ్యి వేయించింది.

"ఒరేయ్ అన్నయ్యా! ఆ నెయ్యిలో ఎంత కొవ్వు ఉంటుందో తెలుసా?" అమృత ఓ గావుకేక పెట్టింది.

"అమృతా! నువ్వూ టేస్ట్ చూడు. అచ్చం అమృతంలా ఉంది" వరుణ్ ఆ రుచిని ఎంజాయ్ చేస్తూ చెప్పాడు.

"చాలు బాబూ! నువ్వు తిన్నది కాక దాన్నెందుకు చెడగొడతావు. ఆ తిండి తింటే ఇంకేమన్నా ఉందా!" సుజాతకప్పటికే వరుణ్‌నీ, శ్రీనివాస్‌నీ చూసి మండిపోతోంది.

కానీ అదేం పట్టించుకోకుండా తృప్తిగా భోంచేసిన వరుణ్ "నాన్నమ్మా మన ఆంధ్రా ఫుడ్ ఇంత టేస్టీగా ఉంటుందని ఇవాళే తెలిసింది. అందులోనూ నీ వంట సూపర్బ్" తెగమెచ్చుకున్నాడు.

సుజాత మూతి ముప్పై వంకర్లు తిప్పింది.

"దీనికేనా వరుణ్! అమ్మమ్మ ఇంకా హడావిడిలో ఉంది కానీ, లేకపోతే ఇంకా చాలా చేసేది" సింధు నవ్వుతూ చెప్పింది.

"సింధూ! నాకు నీ మీద చాలా జెలసీగా ఉంది. హాయిగా నాన్నమ్మ చేతి వంట టేస్ట్ చూస్తున్నావు" అన్నాడు నవ్వుతూ.

"ఇంకెన్నాళ్ళురా! ఇంకో రెండ్రోజులు అంతే. తర్వాత అదీ అత్తారింటికి వెళ్లిపోతుందిగా" దిగులుగా అంది వసంత.

"అలా బెంగపడకు వసూ! అదీ చక్కగా వంటచేస్తుంది కదా హాయిగా ఉంటుంది" శాంతమ్మ వసంతని ఊరడించింది.

★ ★ ★

"అమృతా! ఇంకా రెడీ అవ్వలేదా?" ఆ సాయంత్రం సింధూ మేడ మీద


## ఖరీదైన బాటిల్

ఐర్లండ్‌లో నక్స్ ఐలాండ్ డిస్టిలరీలో 18వ శతాబ్దంలో తయారైన ఒక విస్కీబాటిల్ ఇప్పటికీ భద్రంగా ఉందిట. దాన్ని వేలంలో పెడితే ఇప్పుడు లక్ష పౌండ్లు అంటే మన కరెన్సీలో 75లక్షల రూపాయలు పలికిందిట. ప్రపంచంలో అంత ఖరీదైన విస్కీ బాటిల్ మరొకటి లేదుట.

## తల్లి ప్రేమ

జీవి ఏదైనా తల్లి ప్రేమ ఒక్కటే. ఫ్రిగేట్ పక్షి తన బిడ్డని మగపక్షి రక్షణలో వదిలి దాని ఆహారం కోసం అక్టోబర్ 18న ఆస్ట్రేలియాలోని క్రిస్టమస్ దీవి నించి బయల్దేరి ఇండోనేషియాలోని జావా, సుమత్రా దీవుల మధ్యగా ఆహారవేట సాగిస్తూ పోయింది. వాస్తవంగా ఇతర సముద్ర పక్షులు సేకరించిన చేపల్ని దొంగిలించడం ఫ్రిగేట్ పక్షుల నైజం. కానీ ఈ పక్షి ఎక్కడా ఆగకుండా వేటాడుతూ బోర్నియో దీవిని చుట్టి ఇరవై ఆరురోజుల పాటు నిర్విరామయాత్ర చేసి 2500 మైళ్ళ దూరాన్ని చుట్టడాన్ని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. యాదృచ్ఛికంగా గ్లోబల్ పొజిషనింగ్ పరికరాల ద్వారా నిఘా ఉంచి ఈ అద్భుతపక్షి తల్లి ప్రేమ గురించి తెలుసుకున్నారు. ఇంత కాలం రాబందులు మాత్రమే అత్యధిక దూర ప్రయాణం చేయగలవన్న శాస్త్రజ్ఞుల నమ్మకాన్ని వమ్ముచేసింది పక్షి.

-విమలారామం



కొచ్చి పిల్చింది.

బ్యాగ్‌లోంచి కెమేరా తీసుకుంటున్న వరుణ్ నవ్వాడు.

"సింధూ! మనం గుడికెళ్ళి వంద ప్రదక్షిణాలు చేసినా కూడా అది బాత్ రూంలోంచి బయటకు రాదు. అంతసేపు ఆ మొహాన్ని తోముతుంది" సింధూ కూడా నవ్వింది.

"ఏమన్నావ్?" అమృత కోపంగా బయటకు వచ్చేసింది.

వరుణ్ ఒక్కక్షణం అమృతనీ, సింధూనీ అలా చూస్తుండిపోయాడు. ఏదో అసహజంగా ఉంది ఏమిటదీ?

అప్పుడే మొహం కడుక్కొచ్చిన అమృతని పరిశీలనగా చూశాడు.

అన్నాళ్ళు తెలియలేదు కానీ ఇప్పుడు సింధూ ప్రక్కన అమృత ఆరోజు నాన్నమ్మ అన్నట్లు అచ్చం పేషంట్‌లానే కనిపిస్తోంది.

గుంటలు పడ్డ కళ్ళూ, లోతుకుపోయిన బుగ్గలూ, పాలిపోయిన చర్మం, పొడారిపోయిన పెదవులూ, పూచికపుల్లల్లా కాళ్ళూచేతులూ, ఓపిక లేక వంగి పోయి నుంచున్న అమృతని అయోమయంగా చూశాడు వరుణ్.

ఆమె పక్కనే నవ్వుతూ కబుర్లు చెబుతున్న సింధు కూడా సన్నగా ఉన్నా అచ్చంగా ఎల్లోరా శిల్పంలా తీర్చిదిద్దిన ఫిగర్‌తో, కళకళలాడుతున్న కళ్ళు, ఆరోగ్యంగా మెరిసే ఒళ్ళూ, చిన్న నిగారింపుతో బుగ్గల్లో ఎరుపూ, గులాబీ రేకుల్లా మెరుస్తున్న పెదవులు, విల్లులా వంపు తిరిగిన కనుబొమలూ, వత్తైన జుట్టూ ఏ మేకప్ లేని సహజ సౌందర్యం ఎలా ఉంటుందో మొదటిసారిగా చూశాడు వరుణ్.

ఫౌండేషన్, లిప్‌స్టిక్, ఐలైనర్, మస్కారాలతో ఎంత మేకప్ చేసుకున్నా ఆరోగ్యంగా ఉన్న సింధు ప్రక్కన వెలవెలబోతున్నట్టున్న అమృతని వరుణ్ కాస్త బాధగా చూశాడు.

★ ★ ★

"చీకటి పడకుండా తొందరగా వచ్చేయండి. పెళ్లి కుదిరాక ఆడపిల్లలా బయట తిరగకూడదు" శాంతమ్మ మరీమరీ చెప్పి పంపింది.

ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ గుడికి బయల్దేరారు.

"ఏమే పిల్లా! శ్రీనూ వాళ్ళూ వచ్చారట కదా?" అంటూ దారిలో దర్జాగా అరుగు మీద అప్పలనరసమ్మగారు అమ్మలక్కలతో కూర్చున్నారు.

"అవును బామ్మగారూ!" అంది వినయంగా సింధు.

"చక్కగా ఈడూజోడూగా ఉన్నారు బావమరదళ్ళిద్దరూ ఏం లాభం?" ఆవిడ పెదవి విరిచింది.

"వస్తాం బామ్మగారూ! గుళ్ళో మళ్ళీ లేటవుతుంది" సింధూ గబగబా నడిచింది.

వరుణ్‌కి ఈ వరసలు అవీ పెద్దగా తెలియవు.

సుజాత మొదట్నించీ వాళ్లకి పేర్లతో పిల్చుకోవడమే అలవాటు చేసింది.

"ఏమంటోందావిడ?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు సింధూని.

"ఏం లేదు వరుణ్. పల్లెటూరు కదా వాళ్ళ మాటలు అలాగే ఉంటాయి. మనం వెళ్దాం రండి" తేలిగ్గా చెప్పేసింది సింధు.

గుళ్ళో పూజారిగారు తీర్థం ఇస్తూ అదేమాట.

ఈసారి వరుణ్‌కి కాస్త అర్థమైంది.

ఈ జనరేషన్లో కూడా వాళ్లలా ఆలోచిస్తున్నందుకు చిన్నగా నవ్వుకున్నాడు.

★ ★ ★

ఇంటికి రాగానే సింధు కిచెన్‌లో దూరి ఏదో హడావిడి పడిపోతోంది. అప్పటికే అమృత, సింధు బాగా క్లోజైపోయారు.

"సింధూ నువ్వెందుకు వంట చేస్తున్నావ్ నాన్నమ్మ ఉందిగా?" అమృత ఆశ్చర్యంగా అడిగింది.

"అమ్మమకి రాత్రిపూట సరిగ్గా కనిపించదు అమృతా. అందుకే సాయంత్రం వంట డ్యూటీ నాదే" అంటూ సింధూ బాణలిలో నూనె పోసి చామదుంపల్ని వేసి ఫ్రై చేయడం మొదలుపెట్టింది.

"ఓ గాడ్! ఇంత ఆయిలా?" అమృత కెవ్వుమంది.

"ఏమయింది?" హాల్లో ఉన్న వరుణ్ కంగారుగా కిచెన్‌లోకి వచ్చాడు.

"ఒరేయ్ అన్నయ్యా చూశావా ఎంత ఆయిల్‌లో ఫ్రై చేస్తోందో?" అమృత గాబరా పడుతూ చెప్పింది.

"ఈకూర ఇలాగే చెయ్యాలి అమృతా" నవ్వేసింది సింధు.

ఆమె ఎర్రగా వేయిస్తున్న చామదుంపల ఫ్రై చూస్తూ వరుణ్ "వావ్ సింధూ! ఈ ఫ్రై అంటే నాకు చాలా ఇష్టం. నాన్నమ్మ ఇలాగే ఫ్రై చేసి పెట్టేది" అంటూ చెబుతున్నాడు.

అమృత ఒక్క క్షణం ఆగి-

"సింధూ ఒకటడుగుతాను నువ్వేం ఫీలవ్వవు కదా" మెల్లగా అంది.

## జన్మజన్మల బంధం



తారల బంధాలు రీల్స్ వరకే పరిమితం అవుతాయి. అయితే ఇప్పుడు అమీర్‌ఖాన్-కిరణ్ రావ్‌ల బంధం కలకాలం నిలవాలని యావత్ సినీ ప్రపంచం కోరుకుంటోంది. మొన్నామధ్య జరిగిన వీరి వివాహానికి సినీ పెద్దలు, మిత్రులంతా హాజరయ్యారు. 'ఇంతమంది హాజరవ్వడం మాకెంతో హేపీగా ఉంది' అని మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని వ్యక్తపరిచారీ జంట. 'లగాన్' హిట్ కంటే ఈ ఫంక్షన్ ఎంతో ఆనందాన్నిచ్చిందని అమీర్‌ఖాన్ అభిమానులు ఆనందించారు.




"అడుగూ'' కూర కలుపుతూ అంది సింధు.

"మీరు రోజూ ఇంత ఆయిల్, నెయ్యి తింటారా? దాన్నిండా ఎంత కొలె స్ట్రాల్ ఉంటుందో తెలుసా? ఒంటికస్సలు మంచిది కాదు'' అన్న అమృతని చూసి చిరునవ్వు దనవ్వింది సింధు.

"రోజూ ఇలా తినం కానీ అప్పుడప్పుడు. అలాగే మన బాడీకి ఆయిల్, నెయ్యి కూడా కొంత అవసరమే అమృతా. అందుకే దేన్నీ మానకుండా అన్నీ వెరైటీస్ తినాలి. స్వీట్లు, ఫ్రూట్స్, వెజిటబుల్స్ అన్నీ మేం మామూలుగానే తింటాం. అసలప్పుడే ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటామని అమ్మమ్మ ఎప్పుడూ చెప్పేది'' అంది.

"కానీ మరి మీరిలా సన్నగా, ఫిట్‌గా ఎలా ఉన్నారు?'' సందేహంగా అడి గింది అమృత.

"అమృతా! మేమెప్పుడూ ఫిజికల్ వర్క్ ఏదో ఒకటి చేస్తూనే ఉంటాం. ఏ పనైనా చాలావరకూ మేమే చేసుకుంటాం. ఎక్కడికైనా నడుచుకుంటూనే



## ఉత్సాహం

రోజురోజుకీ సినీరంగంలో కొత్త తారలు వచ్చిపోతున్నారు. అయితే ప్రేక్షకులు కలకాలం గుర్తుంచుకునే పాత్రలు చేస్తే ఇక తిరుగే ఉండదు అంటోంది దేవదాసు హీరోయిన్ ఇలియానా. ఇప్పటికే ఈ చిత్రం గురించి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిందని అందుకే ఈ చిత్రాన్ని విదేశాల్లో కూడా విడు దలచేస్తున్నామని స్రవంతి రవికిషోర్ ప్రకటించారు. ఇదిలా ఉండే ఈ చిత్రం చూసిన కొంతమంది నిర్మాతలు ఇలియానాతో కొత్త చిత్రాలు తీయడానికి ఉత్సాహం చూపుతున్నట్టు తెలిసింది.




వెళ్తాం. చూస్తున్నావుగా మనింట్లో పెళ్ళయినా చుట్టుపక్కల వాళ్ళంతా కూడా వీలయినంతవరకూ సాయం చేస్తున్నారు. అలాగే ఒకరికొకరం హెల్ప్ చేసు కుంటాం. అంతకంటే ఇంకేంలేదు'' సింపుల్‌గా చెప్పేసింది సింధు.

★ ★ ★

ఆ రాత్రి...

వెన్నెల్లో డాబాపైన తిరుగుతూ ఆ చల్లగాలిని పరవశంగా పీలుస్తున్నాడు వరుణ్.

మెట్లమీద చప్పుడైంది. శ్రీనివాస్ చాపా, దిండు పట్టుకుని పైకి వచ్చాడు.

"డాడ్! మీరేంటిలా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

"ఈ ఊరొస్తే ఇక్కడే పడుకుంటాన్రా నేను'' అంటూ ఆ వెన్నెల్లో రిలాక్సిం గ్‌గా పడుకున్నాడు శ్రీనివాస్.

"ఇక్కడ మీకు నిద్రపడుతుందా?'' వింతగా చూస్తూ అడిగాడు.

చిన్నగా నవ్వి-

"మన ఏసీరూముల్లో, డన్‌లప్ పరుపుల్లో కన్నా నాకిక్కడే మంచి గాఢనిద్ర పడుతుంది వరుణ్. నీకు తెలుసా? నా చిన్నతనంలో మేమంతా ఇక్కడే పడు కునేవాళ్ళం. అలా ఆకాశాన్ని చూస్తూ, చుక్కల్ని లెక్కపెడుతూ, చందమామ కథలు వింటూ...ఆ రోజులే వేరు?'' తన్మయత్వంగా చెబుతున్నాడు శ్రీనివాస్.

వరుణ్ నవ్వుతూ వెళ్ళి ఆయన పక్కనే పడుకున్నాడు.

"అవును డాడ్! ఈ ప్రశాంతత, ఈ నిశ్శబ్దం, ఈ గాలి, ఈ వెన్నెల చెప్పలే నంత హాయిగా ఉన్నాయి. నేనెన్ని దేశాలు చూసినా ఇలాంటి వాతావరణం మాత్రం ఎక్కడా చూడలేదు'' అన్నాడు.

"అవును వరుణ్! ఈ ఊరు మన పూర్వీకులది. ఈ నేలలో ఆత్మీయత, ఈ గాలిలో ఆప్యాయత మనల్ని ప్రేమగా పలకరిస్తాయి. అందుకే బాగా అలసిపో యినప్పుడు ఇక్కడికి వచ్చి ఈ గాలి పీలుస్తాను. మళ్ళీ కొత్త శక్తి ఉత్సాహం వస్తాయి?'' అన్నాడు శ్రీనివాస్.

"మామయ్యా! మంచినీళ్ళు ఇక్కడ పెట్టనా?'' సింధు వాటర్ పట్టుకొ చ్చింది.

"రా సింధూ! కూర్చో'' పిలిచాడు వరుణ్.

"నువ్వూ ఇక్కడే ఉన్నావా? ఇంకా పడుకోలేదా?'' అంటూ సింధూ వచ్చి కూర్చుంది.

ఆ వెండి వెన్నెల్లో, తెల్లని ఓణీ, జడలో మల్లెపూలతో ముచ్చటగా కూర్చున్న సింధూని చూస్తుంటే వరుణ్ మనస్సుకి ఆహ్లాదంగా ఉంది. ఆమె చిరునవ్వు హాయిగా, ప్రశాంతంగా సేదతెరుస్తూ చల్లగా ఉంది. కాస్సేపు కూర్చుని సింధు కిందికెళ్ళిపోయినా ఆమె పరిమళం ఆ ప్రదేశమంతా ఆవరిం చుకున్నట్టు ఏదో చక్కని అనుభూతి. 'వెన్నెల్లో మల్లెమొగ్గ' ఇంప్రెసివ్‌గా అను కున్నాడు వరుణ్.

ఎప్పుడో అర్ధరాత్రి మెలకువ వచ్చి పక్కనే ఉన్న వాటర్ కూలింగ్ తగ్గిపోవ డంతో కూల్‌వాటర్ కోసం కిందకెళ్ళాడు.

మెట్లు దిగుతుంటే సన్నగా మాటలు వినిపించి మెల్లగా తొంగిచూశాడు. శాంతమ్మ, వసంత.

వసంత ఎందుకో ఏడుస్తుంటే శాంతమ్మ సముదాయిస్తోంది.

"అమ్మా! ఆయనే ఉండుండే నా కూతుర్ని అన్నయ్యా కాదనేవాడా? నా దురదృష్టం దాన్నీ వదలడం లేదు'' వసంత వెక్కుతూ అంది.

"పోన్లే తల్లీ! అయిందేదో అయింది ఇక ఊరుకో'' అంది శాంతమ్మ.

"ఎలా ఊరుకోనమ్మా! ఎప్పుడూ బయటికి చెప్పకపోయినా సింధూకి వరుణ్ అంటే ఎంతిష్టమో మనకీ తెలుసు. వాడికిష్టమైనవన్నీ అదంత గుర్తుపె ట్టుకుందంటే నా గుండె పిండేసినట్లుంది. నేనే బలవంతాన దాన్ని ఈ పెళ్ళికి ఒప్పించి తప్పు చేస్తున్నాననిపిస్తోంది'' వసంతకి దుఃఖం ఆగడంలేదు.

"వసూ అందుకే కదా నా ప్రయత్నం నేను చేశాను. సుజాత కస్సలు ఇష్టం లేదు. శ్రీను ఎటూ చెప్పలేడు. అయినా ఎవరికెవరో అంతా రాసే ఉంటుం దమ్మా. అంతా మన మంచికే అనుకో" శాంతమ్మ వసంత తలనిమురుతూ ఊరడిస్తోంది.

"అంటే?" వరుణ్‌కి అంతా అర్థమైపోయింది.

ఎందుకో గుండెలో బాధ మొదలైంది.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. సింధుకి అన్యాయం జరిగిందన్పిస్తోంది. ఆమెకే కాదు తనకి కూడా.

* * *

పొద్దున్న సింధుని పెళ్లికూతురిని చేస్తున్నారు. ఎర్రని పట్టుచీర, నుదుట కల్యాణం బొట్టు, బుగ్గన చుక్కతో సింధు ముద్దమందారంలా ముగ్ధంగా ఉంది.

తన హ్యాండీకామ్‌తో ఆ పేరంటాన్ని వీడియో తీస్తున్న వరుణ్‌కి మనసంతా ఉదాశీనంగా ఉంది.

అందరికీ అక్షింతలిచ్చి వాళ్ల కాళ్లకి నమస్కారం చేసి ఆశీర్వాదం అందు కుంటున్న సింధు, వరుణ్ దగ్గరికొచ్చి అక్షింతలిచ్చింది.

"అరె! నాకెందుకు?" వరుణ్ మొహమాటంగా అన్నాడు.

"ఫర్లేదులే వెయ్యి అసలది నీ పెళ్లాం కావాల్సిన పిల్లే" అప్పననరసమ్మ గారు ఉండబట్టలేక అనేసింది.

ఆ మాట ఎక్కడో సున్నితమైన చోట తగిలినట్లు సింధు మొహంలో రెపరె పలాడిన బాధ వరుణ్‌కి స్పష్టంగా కనిపించి అతని మనస్సు విలవిలలాడింది.

"ఏంటండీ మీరు? పిల్లల ముందు ఏమిటా మాటలు?" అప్పటికే అప్పల నరసమ్మగారి పెత్తనానికి ఒళ్ళుమండిపోతున్న సుజాత కోపంగా అంది.

"నేనేమన్నాను? ఉన్నమాటేగా?" ఆవిడా తగ్గలేదు.

"ఏమాటయినా మీ హద్దుల్లో మీరు ఉండండి. మా విషయాల్లో జోక్యం చేసుకుంటే ఊరుకునేది లేదు" సుజాత తీవ్రంగా అంది.

దాంతో అప్పలనరసమ్మగారు ఉగ్రనరసింహావతారం దాల్చింది. ఆవిడతో పాటూ అమ్మలక్కలందరూ అంత అవమానం జరిగాక ఇక ఈ పెళ్లితో మాకేం పనిలేదని శాంతమ్మ, వసంతా బ్రతిమిలాడుతున్నా వినకుండా ఆవేశంగా వెళ్ళి పోయారు.

"సుజాతా! అప్పలనరసమ్మగారి అజమాయిషీ లేకుండా ఈ ఊళ్ళో ఏ శుభకార్యమూ జరగదు. ఆవిడ మంచికి మంచీ, చెడుకు చెడు. ఇక ఈ పెళ్ళి పనులు చూసేదెవరమ్మా" శాంతమ్మ భయంగా అంది.

"మనమంతా లేమా? పోతే పోనీయండి ఆవిడ లేకపోతే కొంపేం మునిగి పోదు" సుజాతకింకా కోపం తగ్గలేదు.

* * *

"శీనూ! మగపెళ్ళివాళ్ళు పొద్దున్నే వచ్చేస్తారు. ఏర్పాట్లన్నీ సరిగ్గా ఉన్నాయా?" అప్పరనరసమ్మ గారి ఆసరా పోవడంతో శాంతమ్మ చాలా కంగారుపడుతోంది.

"ఫర్లేదమ్మా. అన్ని ఎరేంజ్‌మెంట్లు అయిపోయాయి. వంటవాళ్ళు కూడా వచ్చేశారు. చేతికింద పనివాళ్ళున్నారు. పెళ్లిరేపు రాత్రి కదా అప్పటికింకేం ప్రాబ్లం లేదు" శ్రీనివాస్ ధైర్యం చెప్పినా శాంతమ్మకి మాత్రం ఏదో గాబరాగానే ఉంది. మర్నాడు తెల్లవారుజామునే లేచి బాత్రూంలోకి వెళ్లిన శాంతమ్మ ఆ టెన్షన్‌లో కాలు జారి పడిపోయింది. కాలు మడతపడి లేవలేక నొప్పితో మంచం ఎక్కింది.

"సుజాతా! నువ్వే ఇక పూనుకుని ఈ పెళ్లి జరిపించాలమ్మా నావనైపో యింది" మూలుగుతూ చెప్పింది.

"ఏంటమ్మా ఈ అపశకునం?" వసంత భయపడుతూ అంది.

"శుభమా అంటూ పెళ్లింట్లో ఈ మాటలేంటి వసూ. అమ్మకేమైంది కాలుజా రిపడిందంతే" శ్రీనివాస్ వారించాడు.

మగపెళ్లివాళ్ళు వచ్చేశారని తెలిసి వాళ్లని విడిదిలో దింపడానికి అంతా హడావిడి పడుతూ వెళ్లారు.

"అమ్మగారూ!" వంటవాడు కంగారుగా వచ్చాడు.

"ఏమయింది?" అంది శాంతమ్మ.

"ఎలా పడిందో గానీ ఇడ్లీపిండిలో బల్లి పడిందమ్మా!" భయంగా చెప్పాడు.

అప్పుడే వచ్చిన సుజాత, శ్రీనివాస్

"అదేంటి? రాత్రి మూతలు పెట్టారుగా ఎలా పడుతుంది?" నిలదీశారు.


"పెట్టామమ్మా మీరే వచ్చిచూడండి ఎలా పడిందో మాకూ తెలియడం లేదు" అంటూ తీసుకెళ్ళి చూపించాడు. అదిచూసి-

"సరె సరె! రేపటికోసం ఉప్మారవ్వ తెప్పించాం కదా అది చేసేయండి" వాళ్లకి పురమాయించింది సుజాత మళ్లీ.

## విచిత్ర క్షమాభిక్ష

అరవై ఏళ్లక్రితం జార్జియాలో ఇబివైట్ అనే అతను తన పిండిమరలో పనిచేయడానికి లీనాబేకర్ అనే స్త్రీని నియమించుకున్నాడు. తనకా పని కష్టంగా ఉందని ఆమె వదిలివెళ్ళిపోతానంటే అతను షూట్ చేస్తానని ఆమెను బెదిరించాడు. ఆమె అతని చేతుల్లోంచి పిస్తోల్ లాక్కుంది. అత నొక మెటల్‌రాడ్‌తో ఆమెను కొట్టబోతే తన ఆత్మరక్షణ కోసం ఆమె పిస్తోల్ కాల్చింది. ఆ కేసులో ఒక తెల్లవాడిని నీగ్రో వనిత చంపిందన్నట్లుగా జ్యూరీ నిర్ణయించి ఆమెకు మరణదండన విధించారు. 1945లో ఆమెను ఎలక్ట్రిక్ ఛెయిర్‌లో కూర్చోబెట్టి మరణశిక్ష అమలు జరిపారు. ఈ 60 ఏళ్ళల్లో జార్జి యాలో మరే స్త్రీకి మరణశిక్ష పడలేదు. ఆమె సంతతి వారు ఆమె మీద పడిన అపవాదు తొలగించాలని జార్జియా బోర్డుని ఇటీవల అప్పీల్ చేశారు. 'ఒక మనిషిని ఖూనీ చేసి నేరస్తురాలే అయినా తన ఆత్మరక్షణ కోసం చేసినందువల్ల ఆమెకంత పెద్దశిక్ష వేయడం అన్యాయం. అమ్మెమీద దయతలచి శిక్ష తగ్గించి ఉండాల్సింది' అని బోర్డు తీర్పుచెప్పింది. ఆమెకు క్షమాభిక్ష దొరకడానికి 60 ఏళ్ళు పట్టినా ఆమె మీద పడిన మచ్చ మాసిపో యిందని ఆమె దాయాదులు సంతృప్తి పడ్డారు. ప్రాణం పోయాక వచ్చే క్షమాభిక్ష ఎలాంటి ప్రయోజనాన్ని కలిగించకపోయినా లోకుల దృష్టిలో ఆమె నిర్దోషిత్వం బయటపడిందన్నమాట. ఆమె దాయాదుల పట్టుదల మెచ్చదగినదే.

-విమలారామం



పట్టుచీర మార్చుకోవడానికి పరిగెత్తింది.

గంటకో పట్టుచీర, నగలు మారుస్తూ మొహానికి మేకప్‌తో ఆ పెళ్లిలో తన హోదా అంతా చూపించాలని తెగ తాపత్రయపడుతోంది.

వంటవాళ్ళు మళ్ళీ ఉప్మా ప్రిపరేషన్స్ చేసి మగపెళ్లివాళ్లకి పట్టుకెళ్లేసరికి తొమ్మిది దాటింది.

"ఇదేంటి ఉప్మానా? ఉప్పు కషాయమా?" నోట్లో పెట్టుకున్న వాళ్లంతా ఉమ్మేశారు.

వాళ్లేదో గొడవ చేయడానికి అంటున్నారనుకున్న శ్రీనివాస్ తనూ కాస్త రుచి చూసి అది నిజమే అని తెలిసి ఖంగుతిన్నాడు.

వాళ్లని క్షమించమని అడిగి మళ్ళీ టిఫిన్లు చేయిస్తామని సర్దిచెబుతుంటే-

"అయ్యగారూ!" పనివాడు కంగారుపడుతూ వచ్చాడు.

"ఏమైంది?" శాంతమ్మ ఎలా ఉందో అని శ్రీనివాస్ కంగారుపడ్డాడు.

"ఆ వంటవాళ్లిద్దరూ అన్నదమ్ములట. వాళ్ల చుట్టాలెవరో పోయారట. ఇప్పుడే ఫోనొచ్చిందిట. మైలతో వంట చెయ్యకూడదని వెళ్లిపోయారు. టౌన్ కెళ్లి వేరే వంటవాళ్లని పంపిస్తారట" అని చెబుతున్నాడు.

"ఖర్మ! ఇప్పుడు వీళ్లకి టిఫిన్లెలాగండీ?" ఈసారి సుజాతా ఖంగుతింది.

"ఇప్పటికే టైం పదవుతోంది. ఇక మీరు టిఫిన్లెప్పుడు పెడతారు? భోజనాలెప్పుడు చేయిస్తారు?" పెళ్లి పెద్ద విరుచుకుపడ్డాడు.

★ ★ ★

"అత్తయ్యా! ఈ ఊళ్ళో ఎవరైనా వంటవాళ్లుంటే కబురు పెట్టించండి" సుజాత కంగారుగా ఇంటికొచ్చింది.

అప్పటికే వసంతకి కళ్లనీళ్ళు, ఆయాసం వచ్చేస్తున్నాయి.

శాంతమ్మా బాగా బెంగపడుతోంది.

"ఇక్కడెవరున్నారమ్మా? శుద్ధ పల్లెటూరు. ఏదైనా టౌన్‌నుంచి రావాల్సిందే. ఉండు అప్పలనరసమ్మకి కబురుపెడతాను ఏదైనా సలహా చెప్తుంది" అని పనివాడితో కబురుపెట్టింది శాంతమ్మ.

"ఆవిడ రానన్నారమ్మా" పనివాడు బుల్లెట్‌లా వెళ్లి వచ్చాడు.

"వదినా! పద నువ్వూనేనూ ఎలాగోలా మళ్లీ కాస్త ఉప్మా చేద్దాం. ఇంకా లేటయితే ఎలా?" వసంత నీరసంగా లేచింది.

'ఇదెక్కడి తంటా?' సుజాత గుండె గుభేల్‌మంది.

"ముందా పనిచెయ్యండి. లంచ్‌టైంకి ఎలాగూ వంటవాళ్ళు వచ్చేస్తారు" శ్రీనివాస్‌కి కూడా ఆ ఆలోచన వచ్చింది.

వందమందికి ఉప్మా ఎలా చెయ్యాలో తెలీదు. ఇంకో పక్క రవ్వలేదు. మళ్ళీ పనివాళ్లని పంపి రవ్వ తెప్పించి ఎలాగోలా చచ్చీచెడీ సుజాతా వసంతా ఉప్మాలు చేసేసరికి పదకొండయింది.

అప్పటికే పెళ్లివాళ్ళు రాజుకుపోతున్నారు. కొలతలు తెలీక ఉప్మా కాస్తా అందరికీ తలో గరిటెడూ కూడా రాలేదు. కలపడం చేతకాక ఉప్మా అంతా ఉండలు ఉండలు. అదీగాక సుజాత చేతిలోంచి ఉప్పూ కారం అసలే ఊడిపడవు. అది చూసి తారాజువ్వలా తాడెత్తున లేచారు మగపెళ్లివాళ్ళు.

"అసలిది మనుషులు తినేదేనా? టిఫిన్‌కే గతిలేకపోతే ఇక పెళ్లేం చేస్తారు" పెళ్లిపెద్ద అగ్గిమీద గుగ్గిలమై పోయాడు.

పన్నెండయినా వంటవాళ్ళ అజాపజా లేదు. ఉప్మాచేసి వడ్డించేసరికే సుజాత పనైపోయింది.

సోలిపోయి ఓ మూల కూర్చుంది. పట్టుచీర మాట దేవుడెరుగు పాతచీర కట్టుకునే ఓపిక కూడా లేదు. అప్పలనరసమ్మగారూ, అమ్మలక్కలూ రాకపోతే ఇక పరువు దక్కేలా లేదని వసంత వెళ్లి కళ్లనీళ్లతో వాళ్లని బ్రతిమాలింది. ఆమె మొహం చూసి కాస్త బెట్టు సడలించి అప్పలనరసమ్మగారు అమ్మలక్కలూ వచ్చి సుజాతని ఓ చూపుచూసి వంటలు మొదలెట్టి పెళ్లివాళ్లకి వడ్డించడం మొదలెట్టేసరికి మిట్టమధ్యాహ్నం మూడు దాటిపోయింది.

అప్పటికే అందరికీ శోషలు వచ్చేస్తున్నాయి. అసలే విసుగ్గా ఉన్న సుజాతకి అప్పలనరసమ్మగారి సూటిపోటీ మాటలకి ఇంకో పక్క చిర్రెత్తుకొచ్చేస్తోంది.

"నేనూ వడ్డిస్తా" అమృత కూడా ఓ గిన్నె పట్టుకుని వడ్డనకి తయారైంది.

"నువ్వేం వడ్డిస్తావే పిల్లా? గాలేస్తే ఎగిరిపోయేట్టున్నావు? మీ అమ్మ నిర్వాకం ఇంట్లో కూడా ఇంతేనా? నీకసలు తిండి పెడుతుందా?" అప్పలనరసమ్మగారి అజమాయిషీ పెరిగిపోతోంది.

ఆవిడ ఎంత పవర్‌ఫుల్లో అప్పటికే బాగా అర్థమైన సుజాత కక్కలేక మింగలేక లోలోపలే కారాలు, మిరియాలు నూరుకుంటోంది. సాంబారు బకెట్ అతి కష్టం మీద ఎత్తి పట్టుకొచ్చి వడ్డిస్తున్న అమృత పాపం శక్తి చాలక పెళ్లిపెద్దకి వడ్డిస్తూ తడబడి బకెట్ కాస్తా కిందపడేసింది.

ఆ సాంబారంతా ఆయన పైకి, చుట్టూ ఉన్న అందరిపైనా పది పట్టుచీరలు కట్టుకున్న ఆడవాళ్లపైన తుళ్ళి అంతా గందరగోళం అయిపోయింది.

## సాంకేతికత

అమెరికాలో ఒక చోట కేఫిటేరియాకి వచ్చి తను తాగిన కాఫీకి ఇరవై డాలర్లనోటు ఇచ్చాడట ఓ పదేళ్ల కుర్రాడు. మేనేజర్‌కి అనుమానం వచ్చి పోలీసుల్ని పిలిచాడు. వాళ్ల తనిఖీలో ఆ కుర్రాడి దగ్గర 179 డాలర్ల దొంగ నోట్లున్నాయని తెలిసింది. ఇవెక్కడివని వాడ్ని అడిగితే తన హోం కంప్యూటర్‌లోంచి ప్రింటు చేసి తెచ్చానని చెప్పాడుట ఆ పిల్లాడు.

## పదేళ్ల రచయిత

తల్లిదండ్రులు విడాకులిచ్చుకుంటే పిల్లలెలాంటి ఇబ్బందుల పాలవుతారో వివరిస్తూ అలాంటిదానికి దారితీయకుండా వాళ్ళ పిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో హెల్ప్, హోప్ అండ్ హేపీనెస్ అన్న పుస్తకాన్ని రాసిందిట లిచ్చీ అనే పదేళ్ల అమ్మాయి. ఆరేళ్ల వయస్సులో తల్లిదండ్రులు విడిపోవడం వల్లనే స్వానుభవంతో తానీ పుస్తకాన్ని రాశానని ముందుమాటలో రాసిందిట ఆ పిల్ల.

## ముద్దుల దుండగుడు

హాలెండ్‌లో 20 ఏళ్ళ ఓ దుండగుడు ఆడవాళ్ల వెనక్కు వెళ్లి భుజం మీద తట్టడం, వాళ్ళు వెనక్కి తిరిగేటప్పటికి ముద్దు పెట్టుకుని పారిపోవడం చేస్తుండేవాడు. అతనెలా ఉంటాడో తెలియక పోలీసులు సరిగ్గా పరిశోధన చేయలేకపోయారు. అతని గురించిన జాడ ఇప్పటికీ తెలియరాలేదు.

-విమలారామం



అప్పటికే సహనం చచ్చిపోయిన మగపెళ్లివాళ్ళు భోజనాల నుంచి లేచి పోయి ఆ అమర్యాదకి చిందులు తొక్కడం మొదలుపెట్టారు. అమృత మీదా సాంబారుపడి బిక్కమొహంతో వాళ్లకి సారీ చెప్తున్నా వాళ్లసలు పట్టించుకో లేదు.

"ఛీ! అంతా ఛండాలం. ఏం పిల్ల? ఏం పెళ్ళి?" పెళ్ళిపెద్దతో పాటు అంతా తలా ఒక మాట అంటూ గొడవకి దిగారు.

"ఏమే పిల్లా! ఇందుకేనా వద్దన్నా వడ్డనకి తయారయ్యావు? ఏంచేస్తాం? అంతా ఆ మహాతల్లి పెంపకం" అప్పలనరసమ్మా అమృతనే అంటూ మగపె ళ్లివాళ్లకి సర్దిచెప్పాలని చూస్తోంది.

ఆ మాటలకి అమృతకి ఏడుపొక్కటే తక్కువ. దీనంగా వాళ్లమ్మ వైపు చూసింది. అది చూసి సుజాతా ఇక తట్టుకోలేక-

"మాటలు కాస్త తిన్నగా రానివ్వండి. అదేం చేసింది. ఏదో చెయ్యి జారింది" అంటూ అమృతని వెనకేసుకొచ్చింది.

ఆ మాటతో మగపెళ్లివాళ్ళు ఇంకా రెచ్చిపోయారు. చివరికి పెళ్లి పెద్ద పెళ్లిక్యాన్సిల్ అనేవరకూ వచ్చింది.

శాంతమ్మ కుంటుకుంటూ అలాగే వచ్చి బతిమిలాడసాగింది.

వసంతకైతే దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

"ఏం మనిషివి? నీ కొడుకుకి చేసుకోకపోతే పోయావ్ కానీ నీ మాట దురు సుతనంతో అవతల జరిగే పెళ్లి చెడగొడుతున్నావ్?" అప్పలనరసమ్మగారింక సుజాత మీద అపవాదు వేసేశారు.

"బామ్మగారూ! మా అమ్మనేమన్నా అంటే నేనూరుకోను" అన్నాడు వరుణ్ సీరియస్‌గా.

"ఆ అమ్మ? అక్కడ మీ అత్త చూడు ఎలా కుళ్లికుళ్ళి ఏడుస్తోందో? అవ తల పిల్ల జీవితం నాశనం అయిపోతోంది" ఆవిడ ఆవేశంగా అంది.

"అలా ఏం జరగదు. సింధూని ఈ ముహూర్తానికి నేనే పెళ్లి చేసుకుం టాను. అంతేకానీ మీరింక మా అమ్మనేం అనకండి" వరుణ్ ఖచ్చితంగా చెప్పే శాడు.

అంతా షాకింగ్‌గా చూస్తుండిపోయారు.

సుజాత మొహం పాలిపోయింది. వసంత మొహం పుచ్చపువ్వులా వికసిం చింది. శ్రీనివాస్ యధాప్రకారం ఎటూ చెప్పకుండా మౌనంగా ఉండిపో యాడు.

"బోడి సంబంధం?" అప్పటికే మగపెళ్లివాళ్ళు కస్సుబుస్సుమంటూ వెళ్లి పోయారు.

అప్పలనరసమ్మగారి మొహం ఆనందంతో విప్పారింది.

"అయితే ఇంకేం? అసలు మీ ఇద్దరికీ రాసుండుంటుంది. అందుకే ఈ పెళ్లిలా చెడిపోయింది" సంబరంగా అంటోంది.

అవునవునంటూ అమ్మలక్కలూ వంతపాడుతున్నారు.

"సింధూ ఒకసారి నాతోరా నీతో మాట్లాడాలి" ఇంకా షాక్‌లోనే ఉన్న సింధూ చెయ్యి పట్టుకుని మేడమీదికి తీసుకెళ్లాడు వరుణ్.

"వరుణ్ తొందరపడ్డావేమో?" సింధూ నెమ్మదిగా అంది.

"తొందరపడలేదు వాడు నీతో ప్రేమలో పడ్డాడు?" వాళ్ల వెనకే వచ్చిన అమృత నవ్వుతూ చెప్పింది.

"వరుణ్!" అతని కళ్లల్లోకి విభ్రాంతిగా చూసింది సింధు.

"అవును సింధూ! ఈ వెన్నెల్లో మల్లెమొగ్గని నేను వదులుకోలేకపోయాను. నీకూ నేనంటే ఇష్టం ఉందని తెలిసి ఇవాళ ఈ పెళ్లి చెడగొట్టాను. బల్లిబొమ్మ ఇడ్లీ పిండిలో కలిపి, ఉప్మాలో ఉప్పు కలిపి, వంటవాళ్లకి డబ్బులిచ్చి పంపి, అమృత హెల్ప్‌తో ఎల్గాగైతేనేం ఈ పెళ్ళి ఆపేశాను. అలాగే అప్పలనరసమ్మ గారి అలక కూడా నాకు బాగానే హెల్ప్ చేసింది"

ఫ్రాంక్‌గా చెప్పేసిన వరుణ్‌ని కళ్లనిండా నీళ్లతో హత్తుకుపోయింది సింధు.

"ఏయ్ సింధూ! నన్ను మర్చిపోయావ్? వాడికేనా ఫీజు నాకివ్వవా?" కొంటెగా అడిగింది అమృత.

"ఏంకావాలి?" సిగ్గుపడుతూ అడిగింది సింధు.

"నన్నూ నీలాగే మైండ్‌బ్లోయింగా తయారుచేయాలి" నవ్వింది అమృత.


"థాంక్‌గాడ్! అయితే ఇక మనింట్లో ఆ డైటింగుల గోల ఉండదన్నమాట" రిలీఫ్‌గా అన్నాడు వరుణ్.

"అవును కానీ ముందు మీరిద్దరూ నాన్నమ్మకేం ఫీజివ్వాలో ఆలోచించు కోండి" చిలిపిగా అంది అమృత.

"అంటే అమ్మమ్మ?" ఆశ్చర్యంతో సింధు కళ్ళు పెద్దవైపోయాయి.

"కాలు జారిపడడం అంతా ఉత్తిదే. అమ్మవాళ్లకి తెలిసిందా అంతే సంగ తులు. అందాకా ష్...గప్‌చిప్" ముగ్గురూ దొంగల్లా ముసిముసిగా నవ్వుకు న్నారు.

★



## బిజీ అవుతానా?

చిత్రం, నువ్వునేను, శ్రీరామ్, మనసంతానువ్వే చిత్రాల్లో నటించి చాలా బిజీ అయిపోయి కొన్ని కారణాల వల్ల కొంతకాలం పాటు చిత్రాలకి దూర మైనా ఇప్పుడు చాలా బిజీ అయిపోయాడు ఉదయ్‌కిరణ్. ఆస్ట్రేలియా ఎన్నారై అమ్మాయి విమలని హీరోయిన్‌గా పరిచయం చేస్తూ కె.బాలచం దర్ నిర్మిస్తున్న కొత్త చిత్రం అబద్ధం ఆడియో విడుదలైంది. ఇక చిత్రం గురించే భారీ అంచనాలు రూపుదిద్దుకుంటున్నాయి. విద్యాసాగర్ సంగీతం ఈ చిత్రానికి ప్లస్‌పాయింట్ అవుతుందంటున్నాడు ఉదయ్. ఈ చిత్రం తర్వాతైనా ఈ యువనటుడు బిజీ అవుతాడేమో చూద్దాం?

